క్లుప్తంగా

జగనన్న పాలనలో గ్రామాల అభివృద్ధి



కోనేరుసెంటర్: జగనన్న పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందాయని వైఎస్సార్ సీపీ బందరు అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కిట్టు తెలిపారు. చిన్నాపురంలో శనివారం పేర్ని కిట్టు సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇచ్చి మరోసారి ఆయన్ని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. రాష్ట్ర ప్రజలకు ఆయన అందించిన సంక్షేమం, అమలు చేసిన పథకాలు, వాటి లబ్ధి తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఓటును వినియోగించుకోవాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మహిళలు ఆహార అలవాట్లు మార్చుకోవాలి

బంటుమిల్లి: మహిళలు ఆహార అలవాట్లు మార్చుకోవాలని సీడీపీవో ఎం.సముద్రవేణి అన్నారు. పౌష్టికాహార ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆకుకూరలతో పాటు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకుని ఆరోగ్యవంతమైన బిడ్డల ఎదుగుదలకు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. బాల్యంలోనే రక్తహీనత లోపాన్ని సరిదిద్దేందుకు ప్రభుత్వాలు ఇస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈవో త్రిపురసుందరీ దేవి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. వారి ఎదుగుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో రామకృష్ణరాజు, ఏపీఎం శ్రీను తదితరులు ప్రసంగించారు. బంటుమిల్లి ప్రాజెక్టు పరిధిలోని సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బుక్‌కీపర్లు, డ్వాక్రా లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు రహదారి

బోడగుంట(మోపిదేవి): దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరావు సహకారంతో శ్మశాన వాటికలో ముళ్లకంప తొలగించి, రహదారి పునర్నించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు. మండలంలోని బోడగుంట, మరుగొయ్యి గ్రామస్తులు వినియోగించే శ్మశాన వాటిక పూర్తిగా ముళ్లకంపతో నిండిపోయింది. రహదారి పిచ్చి మొక్కలతో మూసుకుపోయింది. ఈ విషయాన్ని గ్రామస్తులు ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు కలుపుమందు చల్లించి రహదారిని పునర్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దళితవాడలపై ప్రత్యేక దృష్టి సారించారని, శ్మశాన వాటిక రహదారికి కూడా సీసీ రోడ్డు వేయించారని గుర్తు చేశారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన తనకు దివి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇచ్చి గౌరవించారని తెలిపారు. ఎస్సీలకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ జగనన్న పాలన సాగిస్తున్నారని కొనియాడారు. వెంకటాపురం ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ వరుణ్, తేళ్లబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కొమ్ము జయరావు, కొమ్ము ప్రసాద్, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా నరసింహస్వామి కల్యాణోత్సవాలు

గూడూరు: గూడూరులో ప్రసిద్ధి చెందిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో బృందావరం రాఘవాచార్యుల ఆధ్వర్యాన ఉదయం స్వామి వారిని పెళ్లికుమారుడిగా, అమ్మవారిని పెళ్లికూతురిగా అలంకరించారు. రాత్రి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహణం, బలిహరణ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

సాయుధ బలగాల కవాతు

కోనేరుసెంటర్: సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. బందరు డీఎస్పీ సుభాన్ ఆధ్వర్యంలో జరిగిన కవాతును కోన, పల్లెతుమ్మలపాలెం, పోలాటితిప్ప, పెదకరగ్రహారం గ్రామాల్లో నిర్వహించారు. కవాతులో బందరు రూరల్ ఎస్సైలు చాణక్య, పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్పీ 'అవనిగడ్డ' అభ్యర్థిగా గుంటూరు నాగేశ్వరరావు

కొడాలి(ఘంటసాల): అవనిగడ్డ నియోజకవర్గ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఘంటసాల మండలం, కొడాలి గ్రామానికి చెందిన గుంటూరు నాగేశ్వరరావును పార్టీ ఏపీ అధ్యక్షులు బొక్క పరంజ్యోతి శనివారం ప్రకటించారు. అనంతరం పరంజ్యోతిని నాగేశ్వరరావు సత్కరించారు.



కోర్కెలు తీర్చే కల్పవల్లి నాంచారమ్మ

నేడు, రేపు విశ్వనాథపల్లిలో అమ్మవారి జాతర



అద్దంకి నాంచారమ్మవారు



విశ్వనాథపల్లిలో అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయం

కోడూరు: కృష్ణా తీరంలో భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మవారు ప్రధాన జాతరకు ముస్తాబైంది. ఆది, సోమవారాల్లో జరిగే జాతరకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వచ్చే అవకాశం ఉండడంతో దేవదాయ అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

ఐదు శతాబ్దాల చరిత్ర

విశ్వనాథపల్లి గ్రామంలో సుమారు ఐదు శతాబ్దాల క్రితం కరువు కాటకాలు రావడంతో గ్రామంలోని పశువులకు పశుగ్రాసం కూడా దొరకని పరిస్థితి. ఈ ప్రాంత రైతులు తమ పశువులను నాటి ప్రకాశం జిల్లా అద్దంకి గ్రామానికి (ప్రస్తుతం బాపట్ల జిల్లా) తీసుకువెళ్లారు. అక్కడ పశువులు కొంతకాలం బాగానే ఉన్నా, తర్వాత పశువులు అంతుచిక్కని వ్యాధితో మృతిచెందాయి. దీంతో కంగుతిన్న రైతులు తిరిగి మళ్లీ తమ పశువులను విశ్వనాథపల్లి గ్రామానికి తీసుకువచ్చారు. ఆ సమయంలో ఓ బాలిక కూడా విశ్వనాథపల్లికి వచ్చి ఇక్కడ అంతర్థానమైందని ఆలయ చరిత్ర చెబుతోంది. గ్రామానికి చెందిన ఒక మహిళకు పూనకం వచ్చి తాను అద్దంకి నాంచారమ్మనని, గ్రామంలో ఆలయం నిర్మించాలని కోరింది. దీంతో నాటి గ్రామపెద్ద రామినీడు గ్రామ నడిబొడ్డున అమ్మవారికి చిన్నపాటి ఆలయాన్ని నిర్మించి పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. కరువు కాటకాలు తొలగి గ్రామస్తులు ఆర్థికంగా వృద్ధి చెందగా, అప్పటి నుంచి ఏటా పాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున అమ్మవారి ప్రధాన జాతర చేయడం ఆనవాయితీగా మారింది. 1986లో ఆలయాన్ని పునర్నిర్మించారు.

15 రోజులు చిన్నఅమ్మవారి ఊరేగింపు..

జాతరకు పదిహేను రోజుల ముందు (పాల్గుణ శుద్ధ పాడ్యమి) రోజున నాంచారమ్మ చిన్నఅమ్మవారిని ఆలయం నుంచి బయటకు తీసి ఊరేగిస్తారు. ఆలయాన్ని నిర్మించిన రామినీడుకు ప్రత్యేక ఉత్సవాన్ని జరుపుతారు. విశ్వనాథపల్లి, వి.కొత్తపాలెం, గాబ, కుమ్మరిపాలెం గ్రామాల్లో ప్రతి ఇంటి వద్ద అమ్మవారి భక్తులు పూజలు చేస్తారు. వాహనాలు లేకుండా ప్రజలు నడుచుకుంటూ అమ్మవారి ఊరేగించడం ఇక్కడ ప్రత్యేకత. ఈ నెల 11న చిన్నఅమ్మవారి ఊరేగింపును ప్రారంభించగా, ప్రస్తుతం గాబ గ్రామంలో పూజలు చేస్తున్నారు. నాంచారమ్మ అమ్మవారు అద్దంకి నుంచి రావడంతో గుంటూరు, ప్రకాశం జిల్లాలను అమ్మవారి పుట్టినిల్లుగా భక్తులు భావిస్తారు. దీంతో భక్తుల సౌకర్యం కోసం మచిలీపట్నం, రేపల్లె, అవనిగడ్డ నుంచి 'విశ్వనాథపల్లి స్పెషల్' పేరుతో 15 ప్రత్యేక బస్సు సర్వీసులను కూడా ఏర్పాటు చేశారు. 200 మంది పోలీసులను బందోబస్తుకు నియమించారు. కృష్ణానది వద్ద పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటుచేశారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో ముస్తాబు చేశారు. 24వ తేదీ ఆదివారం నాంచారమ్మ మూలమూర్తికి ప్రత్యేక అలంకారం, నైవేద్యాల సమర్పణ, 25న (సోమవారం) ఆలయ ప్రధాన గుడి జాతరను నిర్వహించనున్నట్లు దేవదాయ అధికారులు తెలిపారు.

జాతరలో రాజకీయాలకు తావు లేదు

కోడూరు: విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతరలో రాజకీయాలకు తావు లేదని ఎస్ఐ శిరీష తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో జాతరలో డీజేలకు అనుమతి లేదని ఎస్ఐ స్పష్టం చేశారు. రాజకీయ బ్యానర్లు, జెండాల ఊరేగింపునకు అనుమతి లేదన్నారు. అల్పాహారం, చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ, ఇతరత్రా స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించడానికి ఆర్వో నుంచి అనుమతి తీసుకోవాలని, లేకపోతే ఏ కార్యక్రమం చేపట్టడానికి వీలు లేదని చెప్పారు. పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులను వి.కొత్తపాలెం మీదుగా పంపి, తిరుగు ప్రయాణాన్ని నరసింహపురం–కృష్ణాపురం మీదగా పంపనున్నట్లు ఎస్ఐ చెప్పారు. వన్‌వే ట్రాఫిక్‌ను అందరూ పాటించాలని కోరారు. ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పెదప్రోలులో శ్రీ అద్దంకి నాంచారమ్మ తల్లిని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకుని కుంకుమ పూజలు నిర్వహించారు. సోమవారం జాతర ఉత్సవం జరగనుండటంతో ఆలయ కమిటీ, అభివృద్ధి కమిటీ కుటుంబ సభ్యులు అమ్మవారిని శనివారం దర్శించుకుని కుంకుమార్చన చేసి నైవేద్యాలు సమర్పించుకున్నారు. కార్యక్రమాలను కమిటీ కార్యదర్శి కూరపాటి కోటేశ్వరావు పర్యవేక్షించారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

కలెక్టర్ రాజాబాబు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి శనివారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా, భూగర్భ జలాలు, ఉపాధి హామీ అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ వాటర్ కన్జర్వేషన్, చెరువుల పునరుద్ధరణ పనులపై దృష్టి పెట్టాలన్నారు. అమృత్ సరోవర్ పథకం అమలు, పామ్ పాండ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీసీలో డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి శివప్రసాద్ పాల్గొన్నారు.

ఇకపై రెండు రోజులకు ఒకసారి తాగునీరు

మచిలీపట్నంటౌన్: తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో ఈ నెల 25వ తేదీ తర్వాత రెండు రోజులకు ఒకసారి నీటి సరఫరా జరుగుతుందని కమిషనర్ బాపిరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నగర ప్రజలకు రోజు విడిచి రోజు తాగునీటిని సరఫరా చేస్తున్నామని ఈ వేసవి దృష్ట్యా నీటి నిల్వల ప్రకారం రెండు రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తామన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

శ్రీకాకుళం(ఘంటసాల): పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి, ఎంపీడీవో బి.మారుతిశేషమాంబ అన్నారు. ఘంటసాల మండలంలోని శ్రీకాకుళం, తెలుగురావుపాలెం, అచ్చెంపాలెం, దేవరకోట, చిట్టూర్పు, కొడాలి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎంసీసీ అధికారి మారుతి శేషమాంబ ఈఓపీఆర్డీ గుత్తికొండ కిషోర్‌తో కలసి శనివారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో రాజకీయ నేతల ప్రచార బ్యానర్లు, స్టిక్కర్లు, పోస్టర్లు, గోడమీద రాతలు లేకుండా చూడాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు, బీఎల్వోలు, సిబ్బందికి సూచనలు, సలహాలు అందించామన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

కోడూరు: ఉల్లిపాలెం, హంసలదీవి పంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ ఆర్.శ్రీనివాసరావు, తహసీల్దార్ టి.శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. బీఎల్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

చల్లపల్లి: గ్రామాల్లో ఎన్నికల కోడ్ కచ్చితంగా అమలు చేయాలని ఎంపీడీఓ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. శనివారం చల్లపల్లిలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఎన్నికల కోడ్ అమలు తీరు పరిశీలించారు. మండల పరిధిలోని చల్లపల్లి, నడకుదురు, పురిటిగడ్డ, నాదెళ్లవారిపాలెం, రాముడుపాలెం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈఓఆర్డీ బూరేపల్లి అశోక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'సిలికానాంధ్ర' ఆలోచనలు అద్భుతం

కేయూ ఉపకులపతి జ్ఞానమణి

కోనేరుసెంటర్: అమెరికాలోని సిలికానాంధ్ర విశ్వవిద్యాలయ ఆలోచనలు, ఆవిష్కరణలు విద్యార్థి లోకానికి ఉపయుక్తంగా ఉంటాయని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి. జ్ఞానమణి పేర్కొన్నారు. శనివారం సిలికానాంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'జనరేటివ్ ఏఐతో విప్లవాత్మక మార్పులు – వెక్టర్ డేటాబేస్ పాత్ర' అనే అంశం పై నిర్వహించిన వెబినార్‌లో ప్రారంభోపన్యాసం చేశారు. మాతృభాషకు అమెరికాలో ఆదరణ పొందేలా కృషి చేయడం గర్వించదగ్గ పరిణామం అన్నారు. సిలికానాంధ్ర విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం తర్వాత తొలి అంకం ఈ వెబినార్ అని పేర్కొన్నారు. కొత్త పదాన్ని కనుక్కొని వెక్టార్ డేటాబేస్ ద్వారా అభివృద్ధి చేయడం కొత్త పరిణామమన్నారు. సిలికానాంధ్ర విశ్వవిద్యాలయం చీఫ్ అకాడమిక్ ఆఫీసర్ రాజు చామర్తి మాట్లాడుతూ ఎటువంటి లాభాపేక్ష లేకుండా తమ విశ్వవిద్యాలయం విద్యార్థులకు అవసరమైన సేవలు అందిస్తుందన్నారు. వెబినార్‌లో రిజిస్ట్రార్ ఆచార్య కె.శోభన్‌బాబు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, సిలికానాంధ్ర కంప్యూటర్ సైన్స్ విభాగం డీన్ డాక్టర్ ఎస్.వెంకట్ గుడివాడ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో అన్నివర్గాలకు మేలు

సింహాద్రి రమేష్‌బాబు



అవనిగడ్డ సెంటర్‌లో కరపత్రాలు అందజేస్తున్న సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు కలుగుతోందని వైఎస్సార్ సీపీ అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో ఎమ్మెల్యే రమేష్‌బాబు శనివారం ప్రచారం చేశారు. సెంటర్‌లో షాపులు నిర్వహిస్తున్న వారిని కలుసుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'చెప్పాడంటే చేస్తాడంతే' కరపత్రాలను అందించి మరోసారి తనను, ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావుని గెలిపించాలని కోరారు. సీఎం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు మేలు చేశాయన్నారు. మరోసారి ఆదరిస్తే మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమ, పార్టీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు



నీలిపూడిలో కరపత్రాలను అందజేస్తున్న ఉప్పాల రమేష్ తదితరులు

కృత్తివెన్ను: వైఎస్సార్ సీపీతోనే రాష్ట్ర భవిష్యత్ అని ప్రజలు సంతోషంగా ఉండాలంటే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఆ పార్టీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) అన్నారు. మండల పరిధిలోని నీలిపూడి గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రజాదీవెనలో ఆయన పాల్గొన్నారు. రాముకు గ్రామస్తుల నుంచి అడుగడుగునా ఆదరణ లభించింది. దీనిలో భాగంగా రాము గడపగడపకు తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రజలకు అందించిన సంక్షేమాన్ని వివరించారు. ప్రజలకు ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని ఆరా తీశారు. మనమంతా కలిసి ఫ్యాను గుర్తుపై ఓటేసి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి తేడాను గమనించి మీకు మంచి జరిగిందని భావించి రెండు ఓట్లను ఫ్యాను గుర్తుకే వేయాలని కోరారు. ఆయనతో పాటు ప్రచారంలో ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ పిన్నింటి మహేష్, కృత్తివెన్ను ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, మండల పార్టీ కన్వీనర్ వెంకట్రాజు, ఎంపీటీసీ సుజాత, ఎస్సీ సెల్ కన్వీనర్ జాన్‌రత్నం, ఆర్‌బీకే చైర్మన్ వాసు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సుబ్రహ్మణ్యం, స్థానిక నేతలు రాము, శ్రీనివాసరావు, శివ, పండు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం



ఉత్సవంలో ఆట గుర్రం సందడి

కోడూరు: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పెదగుడుమోటులో బెంగాలీషా బాబావలి ఉరుసు మహోత్సవానికి భక్తజనం పోటెత్తారు. శుక్రవారం రాత్రి 8 నుంచి శనివారం ఉదయం 5గంటల వరకు ఉరుసు మహోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. నిజాంపట్నం, విజయవాడ, మచిలీపట్నం, గుంటూరు, ప్రకాశం, నరసరావుపేట ప్రాంతాలకు చెందిన ముస్లింలు ప్రత్యేక వాహనాల్లో ఉరుసుకు తరలిరావడంతో దర్గా ప్రాంగణం భక్తజనంతో కిక్కిరిసింది. బాబావారి సమాధిపై పచ్చరంగు వస్త్రాన్ని కప్పి గంధాన్ని చల్లారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమ భక్తి భావం చాటుకున్నారు. పలువురు గ్రామస్తులు డప్పువాయిద్యాల మధ్య ప్రత్యేకంగా అలంకరించిన జెండాలను ఊరేగించుకుంటూ దర్గా వద్దకు తీసుకువచ్చారు. దర్గా వద్ద ఆటగుర్రం విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎస్ఐ శిరీష సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కేయూలో హోలీ వేడుకలు



కేయూలో జరిగిన హోలీ వేడుకల్లో విద్యార్థులు

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యాన శనివారం హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆది, సోమవారాలు సెలవు కావడంతో విద్యార్థులు ఒక్కరోజు ముందుగానే హోలీ పండుగ సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థినీవిద్యార్థులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. ఈ సందర్భంగా రసాయనశాస్త్ర విభాగాధిపతి మాట్లాడుతూ క్రీడలు, పండుగలను, మన సంస్కృతి సంప్రదాయాలను, విద్యార్థినీవిద్యార్థులకు దగ్గర చేసి, వారిని వాటిలో పాల్గొనే విధంగా తోడ్పాటును అందించడంలో రసాయన శాస్త్ర విభాగం ముందు ఉంటుందన్నారు. కార్యక్రమంలో రసాయనశాస్త్ర విభాగాధిపతి డి.రామశేఖరరెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది జి.రవి, డాక్టర్ కె.పుష్పలత, డాక్టర్ రాంబాబు, డాక్టర్ టి. అనిల్ కుమార్, డాక్టర్ నరేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళి



మచిలీపట్నంటౌన్: విప్లవవీరుడు భగత్‌సింగ్ త్యాగాలు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద బీమా ఉద్యోగుల సంఘం మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి సంఘ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అతి చిన్న వయసులోనే రాజీలేని పోరాటం చేసి చరిత్రలోకి ఎక్కారన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ జాయింట్ సెక్రటరీ టి.చంద్రపాల్, నాయకులు జె.సుధాకర్, వై. స్వామినాథ్, సీహెచ్ మాధుర్, కె నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లపై ఆరోపణలు అవాస్తవం

కోనేరుసెంటర్: ఎన్నికల కోడ్ అమలులో ఉండగా మండలంలోని పలువురు వలంటీర్లు రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారంటూ వచ్చిన ఫిర్యాదులో వాస్తవం లేదని బందరు ఎంపీడీవో బాలకృష్ణారావు.. రిటర్నింగ్ అధికారి, బందరు ఆర్డీవో వాణికి శనివారం లిఖితపూర్వక నివేదిక ఇచ్చారు. ఈ నెల 23న బందరు మండలం తాళ్లపాలెంలో వైసీపీ నాయకులు నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం లో ఇద్దరు వలంటీర్‌లు, ఓ సచివాలయం ఉద్యోగి పాల్గొన్నారంటూ ఆర్డీవోకు కొంత మంది ఫొటోలతో ఫిర్యాదు చేయగా దీనిపై బందరు ఎంపీడీవోను విచారణ చేసి నివేదిక సమర్పించాలని ఆర్వో కోరారు. విచారణలో ఫిర్యాదుదారుడు ఆర్‌వోకు పంపిన ఫొటోలు ఈ నెల 12న తాళ్లపాలెంలో జరిగిన కార్యక్రమానివిగా తేలింది. దీనికి సంబంధించి పలు పత్రికల్లో వార్తలు కూడా రావటంతో ఎంపీడీవో బాలకృష్ణారావు సాక్ష్యాలతో కూడిన నివేదికను ఆర్‌వోకు సమర్పించి ఫిర్యాదులో వాస్తవంలేదని కొట్టిపడేశారు.

సంఘాభివృద్ధికి వెంకట్రావు కృషి



మచిలీపట్నంటౌన్: కృష్ణా జిల్లా మేకలు, గొర్రెల పెంపకందారుల సహకార సంఘ నాయకుడు పల్లపాటి వెంకట్రావు (చినబాబు) చేసిన కృషి మరువలేనిదని పలువురు వక్తలు పేర్కొన్నారు. జిల్లా మేకలు, గొర్రెల పెంపకందారుల సహకార సంఘానికి గౌరవాధ్యక్షుడిగా నియమితులైన వెంకట్రావును 'మచిలీపట్నం' యాదవ సేవా సంఘం ప్రతినిధులు శనివారం సత్కరించారు. సంఘ నేతలు గొరిపర్తి రాము, వెంకటేశ్వరయాదవ్, శ్రీనివాసరావు, డాక్టర్ ఏడీ రమణయ్య పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న దివ్యకల్యాణ మహోత్సవం

మచిలీపట్నంటౌన్: గొడుగుపేటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం శనివారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. ఉదయం నిత్య ఔపాస, బలిహరణ, విశేష అర్చనలు, హోమాలు నిర్వహించారు. రాత్రి జరిగిన కళ్యాణ మహోత్సవంలో ఎంఎస్‌పీ చక్రవర్తిఆచార్యులు, విజయలక్ష్మి దంపతులు, ఎంవీపీ కృష్ణమాచార్యులు, పద్మజ దివ్య వసుంధర, ఎన్ సీతారామానుజాచార్యులు, జ్యోతిర్లత, ఎన్ వెంకటరమణ, కమలకుమారి, ఎసీ శ్రీనివాసాచార్యులు, కళ్యాణి దంపతులు పీటలపై కూర్చున్నారు. మహోత్సవాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి కేవీ గోపాలరావు, కమిటీ సభ్యుడు నూకల ప్రసాద్ పర్యవేక్షించారు. 24వ తేదీ ఆదివారం రాత్రి స్వామివారి గరుడోత్సవం నిర్వహించనున్నారు.